ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలు పాటించాలి

ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శృతి ఓజాకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, మార్చి 11 : విద్యా సంస్థల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధుల బృందం సభ్యులు అన్నారు. అక్రమంగా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి శృతి ఓజాకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్,కార్పొరేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు అడ్మిషన్లు ఒక చోట తీసుకుంటూ మరోచోట తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. గుర్తింపు లేని కళాశాలల జాబితా విడుదల చేసి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

యూసుఫ్‌గూడలో ప్రజావాణి..

జూబ్లీహిల్స్, మార్చి11 : ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్ : ప్రభుత్వం చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులు కార్పొరేట్ రంగం పోటీని తట్టుకోలేక పోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మార్చి11: తాగునీటి సరఫరా, సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి మునిసిపల్ డివిజన్ పరిధిలో దాదాపు రూ.47 లక్షల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులను పద్మారావుగౌడ్ సోమవారం స్థానిక కార్పొరేటర్ హేమ, వివిధ విభాగాల అధికారులతో కలిసి ప్రారంభించారు. జోషి కాంపౌండ్‌లో రూ.35 లక్షల ఖర్చుతో సీవరేజీ లైన్ నిర్మాణం, రూ.12 లక్షల ఖర్చుతో సీతాఫల్‌మండి రిజర్వాయర్ మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మంచినీటి సరఫరా, సీవరేజీ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని తెలిపారు. 2014 సంవత్సరానికి ముందు నాటి పరిస్థితులతో పోల్చితే సికింద్రాబాద్ పరిధిలో మంచినీటి సరఫరా గణనీయంగా మెరుగు పడిందని తెలిపారు. గతంలో 310 కిలోమీటర్ల మేర దూరాన్ని కలుపుతూ 38,912 కనెక్షన్లతో 55 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మాత్రమే నీటి సరఫరా సాగేదని చెప్పారు. ప్రస్తుతం 13 రిజర్వాయర్లతో నీటి సరఫరా సామర్థ్యం 73 ఎంఎల్‌డీకి పెంచుకున్నామని తెలిపారు. సీతాఫల్‌మండి రిజర్వాయర్‌ను పునర్నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి నిపుణుల నుంచి నివేదికను సిద్ధం చేసి పక్షంరోజుల్లో అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వై.కృష్ణ, మేనేజర్ అన్విత్‌కుమార్, ఏఈ కౌశిక్, నేతలు తీగుల్ల రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, జోషి కాంపౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాసుందర్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి జలమండలి కార్యాలయం వద్ద రిజర్వాయర్ మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సోమవారం కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం రిసాల బజార్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీగణేశ్, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరిత, నర్సింగరావు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం, మార్చి 11:

పవర్ లిఫ్టర్లకు సన్మానం

సత్తా చాటిన పవర్ లిఫ్టర్లను సన్మానించిన దృశ్యం

అమీర్‌పేట్, మార్చి 11: ఈ నెల 9, 10న చందానగర్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టర్లు సత్తా చాటారు. ద్వితీయ స్థానంతో టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నారు. ఎస్ఆర్‌నగర్ బీకేగూడలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేశ్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా కోచ్ బి.ఆనంద్‌రాజ్, అసోసియేషన్ ప్రతినిధులు దండు మల్లేశ్, బొడ్డు ప్రసాద్‌గౌడ్, జ్ఞానప్రకాశ్, ఎస్.కొండల్‌రావు పవర్ లిఫ్టింగ్‌లోని వివిధ విభాగాల్లో సత్తా చాటిన సోను, స్వప్నిక్, భార్గవరాం, సాయిరాం, నాగజ్యోతి, వినీల, బాలకృష్ణ, మిశ్రా, విశాల్‌యాదవ్, నిఖిల్‌రెడ్డి, కునాల్, మనీశ్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

మౌలిక వసతులు కల్పిస్తాం:ఎమ్మెల్యే

మల్కాజిగిరి, మార్చి 11: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్ మల్లికార్జున్‌నగర్ కాలనీలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకున్నారు. బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి డివిజన్ సత్తిరెడ్డి నగర్‌కు చెందిన మంగమ్మ చికిత్స కోసం రూ.1 లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను వారి బంధువులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ ఔట్‌లెట్‌తో పాటు బహుల అంతస్తులకు అనుమతులు ఎలా మంజూరు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. కాలనీల్లో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వేయిస్తామని అన్నారు. అధికారులతో సర్వే చేయించి నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామని, నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధిపనులను ప్రారంభిస్తామని అన్నారు.

కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, అశ్విన్, నిఖిల్, సన్ని, ప్రమోద్, సంజీవ, మహేశ్వరి, అరుణ్, వెంకటేష్‌యాదవ్, పరమేశ్, శోభన్, సందీప్, వెంకట్, మల్లేశ్‌యాదవ్, సతీష్, రమేశ్ చారి, హనుమాన్ చారి, నామ్‌దేవ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గాయత్రి మహిళా మండలి ప్రతినిధులు

మేడిబావి ఆర్యసమాజ్‌లో గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న పలువురు

సికింద్రాబాద్, మార్చి 11: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గాయత్రి మహిళా మండలి ప్రతినిధులు అన్నారు. ఆదివారం రాత్రి సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ఆర్య సమాజ్‌లో గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు, ఆయా రంగాల్లో రాణించిన మహిళలకు బహుమతులను అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా మండలి ప్రతినిధులు మాట్లాడుతూ.. మహిళలు ప్రస్తుత ప్రపంచంలో అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు భారత మహిళా లోకం ఆదర్శవంతంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో గాయత్రి మహిళా మండలి ప్రతినిధులు అనసూయ, దేవి, రామలక్ష్మి, అంజిబాయి, వినిత, సుచరిత, శైలజ, విద్యావతి, మానస, శ్రీవాణి, మైత్రి, గీత, రాణి, అరుణ, గాయత్రి పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు అన్నారు. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన 2002 బ్యాచ్‌కు చెందిన రామలక్ష్మణ రాజు కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన సందర్భంగా కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మహిళలకు చేయూతనిస్తే..

అద్భుత విజయాలు

పద్మశ్రీ , ప్రొఫెసర్ శాంతా సిన్హా

పద్మశ్రీ హారిక ద్రోణవల్లిని సన్మానిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట్, మార్చి 11: మహిళల్లో దాగి ఉన్న శక్తి యుక్తులకు తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుత విజయాలు సాధిస్తారని పద్మశ్రీ, ప్రొఫెసర్ శాంతా సిన్హా పేర్కొన్నారు. ఆత్మస్థైర్యం, పట్టుదలతో ముందడుగు వేస్తే మహిళలు సాధించలేనిదంటూ ఏమీ లేదని పేర్కొన్నారు. సనత్‌నగర్ లయన్స్ డిస్ట్రిక్ట్ 920 డి ఆధ్వర్యంలో 'మహిళా ఉత్సవ్' పేరుతో సోమవారం అమీర్‌పేట్ కమ్మ సంఘం హాలులో ఘనంగా నిర్వహించారు. లయన్ డాక్టర్ పి.సీత అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వివిధ రంగాల్లో విశిష్టత చాటిన మహిళలను ఎంపిక చేసి వారిని ఘనంగా సత్కరించారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు మాట్లాడుతూ.. అందివస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ అన్ని విధాలుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు తమ కుటుంబాలను చక్కదిద్దుకుంటూనే తమ ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తమ ప్రత్యేకతలను చాటిచెప్పడంలో తమ కుతామే సాటి అని వివరించారు. ఈ కార్యక్రమంలో చెస్ గ్రాండ్ మాస్టర్ పద్మశ్రీ హారిక ద్రోణవల్లి, ఎన్ఆర్ఎస్‌పీ-ఇస్రో నుంచి డాక్టర్ పంచాంగుల మంజుశ్రీ, సామాజిక కార్యకర్త మజ్జి శ్రీదేవి, గాయని పార్వతి, దాసరి తదితరులను సన్మానించారు.

అంబర్‌పేట సర్కిల్ సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ పై చర్యలు తీసుకోవాలి

'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసిన శివసేన నాయకుడు

అంబర్‌పేట, మార్చి 11 : అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌లో పని చేస్తు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్ ప్రజావాణిలో సోమవారం డీసీ మారుతి దివాకర్‌కు ఫిర్యాదు చేశారు. సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ మహిళా కార్పొరేటర్ భర్తలతో లాలూచీ పడుతూ అవినీతికి పాల్పడుతున్నారని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మెహిదీపట్నంలో..

మెహిదీపట్నం, మార్చి 11 : ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ సర్కిల్ -12 డిప్యూటీ కమిషనర్ సీహెచ్. నాగేశ్వర్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్ -12 కార్యాలయంలో అధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాంపల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్‌ల ప్రజలు పాల్గొన్నారు. రెండు ఫిర్యాదులు వచ్చాయని ,వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ అన్నారు.

ఏర్పాట్లు: సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందించడానికి నిర్వహించే సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ, మార్చి 11: గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35) సోమవారం కాచిగూడ-విద్యానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- మహాత్మానగర్‌లో రూ.26లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, మార్చి11: సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో రూ.26 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ గౌసొద్దీన్ తహాతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ..అధ్వానంగా ఉన్న రోడ్లను ఆధునీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భోలక్‌పూర్‌లో ఇప్పటికే కోట్లాది రూపాయలతో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు, సీసీ రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పండరీనాథ్ అనారోగ్యానికి గురికావడంతో వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, నాయకుడు రహీం, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

దోమలగూడ ఈశ్వరమ్మబాడలో పాదయాత్ర

బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడలోని ఈశ్వరమ్మబాడలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరమ్మబాడలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల వల్ల నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లడం, నల్లాల్లో కలుషిత నీటి సరఫరా అవుతుందని, దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని, శ్మశానవాటిక వల్ల పాములు వస్తున్నాయని స్థానికులు వాపోయారు. స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, పురాతన ఇనుప స్తంభాలను తొలగించి నూతనంగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసిన తరువాతనే నూతన సీసీ రోడ్లు వేయాలని ఈశ్వరమ్మబాడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల కుమార్, చైర్మన్ జగన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేశ్ గౌడ్, ఓరుగంటి సంతోష్, కృష్ణ, చింతల హరీశ్, మహేందర్, రాకేష్, రాజులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. అదే విధంగా సూరజ్‌నగర్‌లో హుస్సేన్‌సాగర్ మూసీ నాలా నిర్మాణ పనులను సందర్శించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పానుగంటి ప్రభాకర్, సంతోష్, లడ్డు, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, జీహెచ్ఎంసీ డీఈ సన్ని ఏఈ సుభాశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, జల మండలి డీజీఎం కార్తిక్ రెడ్డి, సెక్షన్ మేనేజర్ శ్రీధర్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ముషీరాబాద్, మార్చి11: నాలా పరివాహక ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం అడిక్‌మెట్ డివిజన్ దీన్‌దయాల్‌నగర్‌లో నాలా ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ ఈఈ సన్నీ, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, సయ్యద్ అస్లాం, శ్యామ్‌సుందర్, మహ్మద్ ఖదీర్, గురుదీప్ సింగ్, బల్వంత్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

చిక్కడపల్లి, మార్చి 11: హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాంనగర్ డివిజన్, కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్లకు సంబంధించిన కల్యాణలక్ష్మి 4 చెక్కులు, షాదీముబారక్ 16 చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘు విష్ణు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పారిపోయాడు

జప్తాన్ (ఫైల్)

అడ్డగుట్ట, మార్చి 11: ఇంట్లోంచి బయటికి వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వారాసిగూడ ప్రాంతానికి చెందిన మమత, పవన్‌కుమార్ దంపతుల కొడుకు జప్తాన్ (14). గతంలోనే రెండుసార్లు ఇంట్లో నుంచి పారిపోయాడు. దీంతో మమత చేసేదేమి లేక సైదాబాద్‌లోని చిల్డ్రన్స్ హోంలో జాయిన్ చేసింది. అయితే రెండు రోజుల కోసమని ఆమె బాబును ఇంటికి తీసుకొచ్చింది. దీంతో ఈనెల 6న సదరు బాలుడు ఇంట్లో నుంచి బయటికువెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన తల్లి.. తెలిసిన ప్రాంతాల్లో, బంధువుల ఇండ్లల్లో వాకబు చేసింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలి

మణికొండ, మార్చి 11 : నీటి సరఫరా సక్రమంగా జరిగేలా జలమండలి అధికారులు చూడాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై వాటర్ ప్రెజర్, ఎత్తులో ఉన్న కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. సరఫరా సమయాన్ని గంట నుంచి మరొక 20 నిమిషాలు పెంచాలని, ఎత్తులో ఉన్న కాలనీలకు బూస్టర్లు పెట్టి సరఫరా వేగాన్ని పెంచాలని సూచించారు. అపార్ట్‌మెంట్లకు ట్యాంకర్ల ద్వారా నీరు అందేలా చూడాలన్నారు. లైన్‌మెన్లతో సమావేశం నిర్వహించి సమయానికి నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సానుకూలంగా స్పందించిన జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి 15 రోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో అంతరాయం కలిగిందని ప్రస్తుతం సరి చేశామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌మెంట్ శాతాన్ని పెంచాలి

ఖైరతాబాద్: ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్ శాతాన్ని పెంచాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ కె. హన్మంతు ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ప్రకటించారని, కనీసం 25శాతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వేతన సవరణ బకాయిలు పదవీ విరమణ సమయంలో ఇస్తామని చెబుతున్నారని, అయితే కొందరికి 20-25 ఏండ్ల పైగా సమ యం ఉందని, ఈ నేపథ్యంలో రిటైర్ సమయంలో కాకుండా కొంత కాల పరిమితి పెట్టి బాండ్లు జారీ చేయాలన్నారు.

తప్పని తిప్పలు..

- గృహజ్యోతి లబ్ధి కోసం ప్రజల ఆరాటం
- ప్రజా పాలనలో దరఖాస్తు ఇచ్చినా పొందని అర్హత
- ఆన్‌లైన్ కోసం సర్కిల్ కార్యాలయాల వద్ద జనం బారులు

మల్కాజిగిరి,మార్చి11: అధికారులు చేసిన తప్పిదాలకు జనం ఉచిత విద్యుత్ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. జీరో బిల్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న అధికారుల సూచన మేరకు తెల్ల రేషన్ కార్డుదారులు సోమవారం మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌ల పరిధిలోని దరఖాస్తులు చేసుకునేందుకు సర్కిల్ కార్యాలయాల్లో బారులు తీరుతున్నారు. మల్కాజిగిరి సర్కిల్‌లోని ఆరు డివిజన్‌ల వారి కోసం సర్కిల్ కార్యాలయం, అల్వాల్ సర్కిల్ పరిధిలోని వార్డు కార్యాలయాలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరి పేర్లు ఎందుకు నమోదు చేయలేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధార్, విద్యుత్ తదితర నంబర్లు తప్పుగా నమోదు కావడంతో ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని సరిచేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు తెలిపారు.

మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఉచిత విద్యుత్ కోసం బారులుతీరిన దరఖాస్తుదారులు

సీసీ పనులకు మేయర్ శంకుస్థాపన

బోడుప్పల్:బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మేయర్ బుచ్చిరెడ్డి తెలిపారు. నగర పరిధిలోని 15వ డివిజన్ లక్ష్మారెడ్డి, టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారి మీదుగా రూ.54లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం 3వ డివిజన్ చెంగిచర్లలో 9లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు.

గంజాయి పట్టివేత

బండ్లగూడ : ఆటోలో తరలిస్తున్న గంజాయిని రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్రో పిల్లర్ నంబర్ 172 సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డులో ఆటోలో గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆటోలో తరలిస్తున్న 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎంఎం పహాడ్‌కు చెందిన మహ్మద్ షకీల్‌గా గుర్తించారు. అత్తాపూర్ పోలీసులకు గంజాయితో పాటు నిందితుడిని అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.